ఇంత సాహసమా!

టి. సీతమ్మ

రాజ్యలక్ష్మిమీద నాకు అమితమైన ప్రేమ. ఆవిడ నొక ప్రేమదేవతగా భావిస్తున్నానంటే గొప్పగా చెప్పుకోవడం కాదు. ఆ ప్రేమోపాసనలో ఆవిడలో పాలుగాని, ఆస్వార్థపరత పరార్థవిముఖతలుగాని, ఆ ముంగోపముగాని కనుపించేవేకావు. ఆవిడ నిజంగా రూపసి. విద్యావతికూడా. సుఖజీవితానికలవాటుపడ్డది. ఆరుమూడైనా, మూడారైనా సుఖమే వాంఛనీయంగా, పరమార్థంగా పెట్టుకొన్నది. 'ఋణం కృత్వా ఘృతంపిబే'త్తన్న తత్వములోనిది. వివాహమప్పుడూ, ఆతర్వాతా కూడా ఆవిడతృప్తికోసం బోలెడు, అంటే నా యోగ్యతకు మించినన్ని ఖర్చుచేశాను. ఏమైనా నగలునాణేలుగాని, నాజూకువస్తులుగాని తెచ్చానని పసిపట్టితేచాలు ఆవిడను పట్టడానికి పగ్గాలుండేవికావు. సంతోషం పొంగులువారిపోయేది.

తొలిరోజులు బాగానే సుఖంగా గడచిపోయినాయి. ఆవిడ చెప్పినట్లల్లా మొగ్గుతూ ఉండడంబట్టి ఏ ఒక్కసంఘర్షణకూ కారణం లేకపోయింది. నావాళ్లెవరన్నా రావడంగాని, వారితో నేను హితంగా వుండడంగాని ఆవిడకు నచ్చకపోతే అస్లే వదలేవాణ్ణి. ఆవిడ స్నేహితురాండ్రనుగురించి నాకు ఆస్కారము లేకపోయినాకూడా ఆస్కారమున్నట్లే ప్రవర్తించేవాణ్ణి. నా ఆదాయానికిమించే, దర్జాగా జీవనంచేస్తూ ఉండినాము. నా జీతముడబ్బులు ఏనెలా సరిపోయినపాపాన పోలేదు. ఎల్లయ్య దగ్గర చేసిన బాకీ తీర్చడానికి పుల్లయ్యదగ్గరా, పుల్లయ్యదగ్గర చేసిన బాకీతీర్చడానికి మల్లయ్య దగ్గరా అప్పులు చేస్తూ ఏదోవిధంగా జరుపుకుంటూ వచ్చాను

హఠాత్తుగా ఒకనాడు నా ఉద్యోగమూడిపోయింది. నా రాజ్యం ఈసంగతి వినీకూడా అణుమాత్రమన్నా అలుకుచూపలేదు. పైగా "ఇదో చూడండి. జరిగిపోయినసంగతిని తడుముకొంటూ ఉండడంలో లాభమేం గాని ఎక్కడైనా వెళ్లి ఇంకొకఉద్యోగం సంపాదించండి త్వరగా. ఊరికేకూర్చుంటే ఎలాగ?" అంటూ తొందరపెట్టడం ఆరంభించింది.

త్వరగా! నెలలకొద్దీ ఆ ఆఫీసునుంచీ ఈ ఆఫీసుకూ, ఈ ఆఫీసునుంచి, ఆ ఆఫీసుకూ తీర్థయాత్రలుచేసినాను. ఎక్కడవిన్నా నేతినేతి వాక్యాలే. ప్రాణానికి విసుగుతోచింది. నిరాశ కమ్ముకొన్నది. కాని సాయంకాలం ఇంటికి వచ్చినప్పుడు మాత్రం ఆవిసుగును, నిరాశను నా రాజ్యానికి కనబడనిచ్చేవాణ్ణికాను. తగినంతజీతం ఇవ్వడానికి ఎవడూ సమ్మతించలేదని, ముందుముందు అవకాశం కలిగినప్పుడు మంచిజీతంగల నౌకరీ యిస్తామని చెప్పారనీ

యేవో కల్పించి చెపుతూవుండేవాణ్ణి. అన్నింటికీ ఆవిడ తల ఊచేది. కాని యీ నిరుద్యోగదినాల్లోఅంతా ఎక్కడనుంచి డబ్బుతెస్తున్నానో, ఏమి అవస్థపడుతున్నానో ఒక్కనాడూ అడిగిందిలేదు. జీవితంమట్టుకు మొదటిలాగానే, మార్పులేకుండా జరిగిపోతూవుంది క్రమభంగం లేకుండా.

ఎన్నాళ్లని దొరకుతూవుంటుంది అప్పు! ఇచ్చేవాండ్లయినా ఏమని యిస్తారు! ఆయిచ్చిన స్నేహితులుకూడా నా నిరుద్యోగావస్థ దిన దినమూ చూస్తూ "ఎట్లరా సుబ్రహ్మణ్యాం మనబాకీ తీరుస్తాడు. గతేమిటి మన"కని తమలోతాము యోచనలు సాగిస్తూ వచ్చారు. ఎట్లాగయితేనేమి, పైసా అప్పుపుట్టడం నాకు నానాటికీ బ్రహ్మప్రళయమైంది.

ఒకరోజు సాయంకాలం ఎక్కడెక్కడో తిరిగి నే నింటికి వచ్చేటప్పటికి రాజ్యం వెక్కి వెక్కి యేడుస్తూవుంది. కారణ మేమిటా అని ఆలోచిస్తే, నేను రెణ్ణెల్లుగా ఇంటిబాడుగ ఇవ్వనందున ఇల్లుగలవాడు మధ్యాహ్నం వచ్చి నానామాటలూ అనిపోయినట్లు గ్రహించాను.

'ఇంత మాత్రానికేనా యింతవ్యసనం' అంటూ ఓదార్చబోయినాను గాని—

'మీకేమండీ, మాటలు చెపుతారు! మధ్యాహ్నం వాడు వచ్చి ఏదేదో వదురుతూవుంటే నాకు తలకొట్టేసినట్లయింది. మీరేదో తృణప్రాయంగా, సమాధానాలు చెప్పవస్తారు. ఆడుమనస్సు నెందుకండీ యిట్లా బాధపెడతారు?'

పరిస్థితులను తెలియజేయడాని కిది మంచి సమయ మనుకొని– ఆరంభించాను.

'చూడు, రాజ్యం. ఇదేదో జరిగిపోయిందిలే. మనపరిస్థితులలో ఇలాంటివి ఎప్పుడో ఒకప్పుడు రాకతప్ప వనుకొన్నదే. ఏమిచేస్తాం. మనగతి యిట్లయింది....'

అనేటప్పటికి నే నేదో అనరానిమాట అన్నట్టు నన్ను తీవ్రంగాచూస్తూ 'ఏమి? ఏమంటిరి?' అని పొంగుకునోయిన గొంతుతో గర్జించింది.

ఏదో మహాపరాధం చేసినట్టు నేను తల వాల్చుకొని మౌనం ధరించాను.

* * * *

'మనగతి చాలా హీనస్థితికి వచ్చింది, రాజ్యం. మన మీ యిల్లు వదలవలసియుంటుంది. బాడుగ చాలాయెక్కువ. ఉద్యోగం దొరికేంతవరకూ ఏవో ఎక్కడో డబ్బుతెస్తూవుంటా ననుకో. కాని, మనం కొంచెం మట్టసంగా, జాగ్రత్తగా ఉండవలె. దమ్మిడీలు కూడా లెక్కపెట్టవలసినరోజు లివి.'

మీద దెబ్బపడిన సర్పంవలె రేగిపోయింది రాజ్యం. బాణాహతికి నిద్రించుచున్న సింహమువలె మండిపడిపోయింది. కండ్లనిప్పులు గక్కుకుంటూ

'ఏమంటారు? నన్నింకా అధోగతికి యీడవడానికి చూస్తున్నారా? దరిద్రగొట్టు

సన్న్యాసులవలె మనం జీవనం చేయవలెనా? నా స్నేహితురాండ్రలో నేను తలయెత్తుకొని తిరగడానికి లేకుండా చేయవలెననా మీ యుద్దేశ్యం?'

'లేదు రాజ్యం, లేదు. చీకటికాలమే యెల్లప్పుడూ ఉంటుందా? మనకు ఇక మంచి రోజులే రావా? ఇటువంటిపరిణామం లోక సహజం గనక—'

ఆవిడకు పెదవులు వణికినాయి.

'అయితే, నేను ముందు చస్తాను.' అంటూ గబగబా బర్లా తెరచియుంచిన కిటికీవైపు నడచింది. మే మొక ఆధునికమైన మేడలో మూడవఅంతస్తున నివసిస్తూన్నాము. కొంప మునిగిపోయిందిరా బాబూ అనుకొంటూ వెంటనే పరుగెత్తుకొని వెళ్లి చెయి పట్టుకొని యివతలికి లాక్కొన్నాను.

'పిచ్చిదానా, ఇంతసాహసానికి పూనుకోవచ్చునా? నీకు తెలియదూ, నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానో! నిన్ను సుఖపెట్టడానికి నేనెంత పాటుపడుతున్నానో నీ వెరగవూ? అన్నీ తెలిసివుండిన్నీ ఇలాచేయవచ్చునా?'

అని తలనిమురుతూ అన్నాను. ఎలాగో సర్ది అప్పుడే ఇంటిబాడుగ చెల్లించివేసివచ్చినాను.

అభిమానమనేది వదలుకొని, అక్షరశః యాచనకు మొదలు పెట్టాను సంసారనిర్వహణంకోసం. నా దైన్యానికి నేను సిగ్గుపడడానికి బదులుగా నా స్నేహితులు తమకు తామే సిగ్గుపడజొచ్చారు. అప్పులరాయణ్ణయిపోతున్నాను క్రమంగా. అయినా నారాజ్యం ఆనందంగా, సుఖంగా ఉంటే చాలుననుకొని తృప్తితో ఉండేవాణ్ణి.

కాని త్రాసు సమంగా తూగడం అసాధ్యమై పోయింది. నే నెన్ని కన్నకష్టాలుపడుతూండినాకూడా అప్పుడప్పుడు సంసారనిర్వహణానికీ, ఆవిడ భోగాలకూ లోపా లేర్పడుతూనే వచ్చినాయి. ఆ లాంటిసందర్భాలు కలిగినప్పుడల్లా నా చేతకానితనానికీ, తనకు సరిగా అమర్చనందుకూ రాజ్యం నన్ను దెప్పిపొడిచేది. సంజాయిషీ లాగా నేనేదైనా చెప్పబూనుకునేటప్పటికి ఆత్మహత్యా ప్రయత్నాలకు దారిచూచేది. అవన్నీ నటనలేనన్నీ, నన్ను బెదరించడానికేనన్నీ నాకు బాగా తెలుసు. కాని, ఏమో, అలా అని అలక్ష్యంగా ఉండలేకపోయేవాణ్ణి. ఎప్పుడన్నా కోపంవచ్చి గుంటతట్టుగా వెళ్లిపోయిందంటే, వెంటబడి సమాధానపరచి వెనుకకు పిలుచుకొనివచ్చేవాణ్ణి. ఏదైనా విషద్రావకపు సీసా చేతికి తీసుకొన్నదంటే, వెంటనే గాబరాగా దాన్ని లాక్కొని అవతల కుమ్మరించేవాణ్ణి.

రాను రాను ఇలాంటి ఆగాయిత్యాలు లెక్కమీరిపోతూవచ్చాయి. అయినా కాని ఆవిడమీద నాకు ప్రేమ తగ్గలేదు. ఉద్యోగం దొరికి మళ్లా సంపాదనలో పడ్డానంటే అన్నీ సరిపోతాయని సమాళించుకొంటూవచ్చాను.

చివర కొక ఉద్యోగం దొరికింది. 'హిందూ'కు స్వకీయవిలేఖరిగా చిత్తూరులో ఉండవలె. రాబడేమో తక్కువగానే ఉంటుంది. కాని ఆమాత్రమైనా వస్తూవుంటే ఎంతమేలు! బ్రహ్మానందమైంది నాకు. భావి అదృష్టానికిది ఒకమెట్టనీ, నిరాక్షేపంగా ఇందుకు రాజ్యలక్ష్మి సమ్మతిస్తుందనీ అభిప్రాయపడ్డాను.

ఈసంతోషవార్త ఆవిడచెవిలో వేసినాను. నా ఊహాలు గాలిలోనే తేలిపోయినాయి. విన్నదే తడవుగ ఆవిడ మహాఅసహ్యంగా "ఏమిటండీ, మీ కంతకంతకు మతిపోతున్నట్టున్నదే! పోయిపోయి ఆ మహాపట్టణములో ఎలా ఉంటామండీ. చూచిచూచి అడవుల్లో కాపరంచేస్తామంటారేమీరు!"అని తన అసంతృప్తిని వెల్లడించింది.

"రాజ్యం, స్వకష్టార్జితంమీద జీవించడమంటే యేమిటో బాగా యోచించు. అటువంటి ఊళ్లల్లో మాత్రం సుఖపడవలెనంటే సుఖపడలేమా? అవకాశాలకు అక్కడ మాత్ర మేంకొదవ? చేతికబ్బిన యుద్యోగాన్ని విడిచిపెట్టడం భావ్యంగా ఉంటుందా?"

"అదంతా జరిగేపనికాదు. ఆ కూపమండూకవాసానికి నేను సుతరామూ ఒప్పకోను. ఈ ఊరిలో తప్ప మరెక్కడా నేనుండలేను. నా సంతోషమే, నా ఆనందమే మీరు కోరేటట్టయితే యిక్కడే ఎక్కడయినా ఉద్యోగం సంపాదించండి. నేను మట్టుకక్కడికి రాను."

"అయితే యిక నీయిష్టం. నేను వెళ్లక తీరదు. ఆ ఉద్యోగం వప్పుకోకతీరదు. మొండిపట్టుపట్టక ఇందుకు సమ్మతించు. నా కోరిక మన్నించు."

ఆవిడను దగ్గరకు తీసుకొన్నాను కాని మూతివిరుపులతో,గొణగొణలతో అవతలకు తొలగిపోయింది.

"దూరంగా ఉండండి, చాలు. ఈ వైభవం చాలు. ఇక బ్రతికివుండి లాభంలేదు. నేటితో సరి, యీ ప్రపంచం."

ఈ మాటలు నేనొక వందమాట్లయినా వినిఉంటాను. ఆత్మహత్యాప్రయత్నానికివి నాందీశ్లోకాలు.

"మళ్లా ఆమాట లెందుకు రాజ్యం?"

"నాహత్యకు మీరే కారకులవుతారనుకోండి. అదిమాత్రం మీజన్మలో మరవలేరు."

ఇవీ కొత్తమాటలు కావు. వెంటనే ఆవిడ వంటయింటిలోనికి సరసరా వెళ్లి తలుపు బిగించుకొంది. అదివరకుఅనుభవాన్నిబట్టి గొంతుకురివేసుకొని చావడానికి ప్రయత్నం కాబోలునని ఊహించుకొన్నాను. వంటయింటి వాకిలివద్దకు వెళ్లాను. ఇక తరవాయి — తలుపులు పగలదీయడమూ, ఆవిడ హత్యాప్రయత్నాన్ని మాన్పడమూ, 'నీ

యానతి మీరజాలగలనా - నీవు చెప్పినట్టు చేస్తాన'ని సమాధానపరచడమూ జరుగవలసింది యథాపూర్వముగా.

కాని నేనందుకు పూనుకోలేదు. అలా చేస్తూవస్తే నేనెంత తెలివితక్కువ దద్దమ్మనై పోతానో ఆలోచించాను.

వెనుదిరిగాను. 'రాజ్యం, ఇక్కడ రా ఒకమాటు' అని పిలిచాను, బదులు పలకలేదు. నాలో నేను నవ్వుకొన్నాను. 'రాజ్యం' నేను లోపల రాబోయేది లేదు. నీయిష్టం. బాగా ఆలోచించుకో' అంటూ నాగదికి నేను వెళ్లిపోయి పడుకొన్నాను. పదినిమిషాల్లో తానే రాకపోతుందా అనే ధైర్యంతో మరి ఆవూసే ఎత్తుకోలేదు. పగలంతా తిరిగితిరిగి వేసరిఉండటంవల్ల వెంటనే, నాకు తెలియకుండానే నిద్రపూనింది.

వేకువజాము అయివుండవచ్చు. నాకు మెలకువ వచ్చింది. నారాజ్యానికోసం ప్రక్కలో తడిమిచాను. లేదు. అభిమానపడి యేమైనా హాల్లో పడుకుందేమోనని లేచి వెళ్లి అక్కడ కలయజూచాను. అక్కడా లేదు. అంతతో గాబరాపట్టుకొన్నది. వంటయింటి దగ్గరికి వెళ్లి తలుపుతట్టాను. రెండు మూడుసార్లు పిలిచాను. బదులులేదు. తలుపులు పగలదీశాను. ఇకనేముంది? దూలానికి వ్రేలాడుతూంది. గుడ్లు కంతలనుండి ఉబికివచ్చినాయి. నిశ్చవున నిర్విణ్ణుడనయిపోయినాను.

భారతీయ చిత్రకళ

గ్రంథకర్త: తలిశెట్టి రామారావుగారు, బి, ఏ., బి. యల్.,

ప్రాచీనకాలమునుండి భారతదేశమున చిత్రకళ పొందుచువచ్చిన మార్పులు, అభివృద్ధి మొదలయిన విషయములు, హైందవ చిత్రలేఖనోదయము, బౌద్ధకాలమునాటి చిత్రకళ, అజంతవిధానము, బాఘ్‌విహారములందలి చిత్రకళ, మొగలు చిత్రకళావిధానము, రాజపుత్ర చిత్రములవైఖరి, నేటిచిత్రములు మొదలయినవానిని గూర్చిన చరిత్రాదులు వివరముగా నీ గ్రంథమున చర్చింపబడినవి. ఆయాకాలపు చిత్రవిధానమును దెలుపునట్టి త్రివర్ణ-ఏకవర్ణచిత్రములు నలువది ఇందు గలవు. చిత్రకారులు, చిత్రకళాజిజ్ఞాసువులు, చిత్ర కళాభిమానులు నగు నాంధ్రులెల్లరు తప్పక చదువవలసిన గ్రంథము. వెల. రు. ౧-౧-౦.

మేనేజరు, ఆంధ్ర గ్రంథమాల, నెం. ౭, తంబుచెట్టివీధి, మదరాసు.